క్లుప్తంగా

కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): కల్లూరు సబ్ రిజిస్ట్రార్‌గా ప్రవీణ్‌కుమార్‌ను నియమిస్తూ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ కల్యాణి ఉత్తర్వులు జారీ చేశారు. సెప్టెంబర్ 22వ తేదీన చేపట్టిన బదిలీల సందర్భంగా కల్లూరు స్టేషన్‌ను ఎవరూ కోరుకోలేదు. అప్పటి నుంచి జిల్లా రిజిస్ట్రార్ (చిట్స్) కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాసరావుకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో బుధవారం సబ్ రిజిస్ట్రార్‌గా నియమతులైన ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు.

నేడు అధికారులతో సమావేశం

సి.బెళగల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఈఓఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, అన్ని గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాణెమ్మ తెలిపారు. గ్రామాల్లో వేసవి దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంచినీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలపై ఉదయం 10:30 గంటలకు నిర్వహించే సమావేశంలో చర్చించనున్నట్లు చెప్పారు. సర్పంచ్‌లు, ఈఓఆర్డీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పాటు పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరు కావాలన్నారు.

మిస్టరీ కేసులపై దృష్టి సారించండి

పాణ్యం: మిస్టరీ కేసులపై దృష్టి సారించాలని నంద్యాల ఎస్‌డీపీఓ జావళి అన్నారు. బుధవారం పాణ్యం పోలీసు స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వాహనదారులుప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. మిస్టరీ కేసులపై దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం ఆలమూరు హెచ్‌ఎంపై నమోదైన పోక్సో కేసుపై విచారణ చేపట్టారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నరేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

వయోజన విద్య వాల్ పోస్టర్ల విడుదల

ఓర్వకల్లు:స్థానిక పొదుపు భవనంలో వయోజ న విద్య వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఏపీ ఎం వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం వయోజన విద్య వలంటీర్ల సమావేశం జరిగింది. ఎంపీడీఓ శ్రీనివాసులు ముఖ్య అతిథులు గా హాజరై మాట్లాడారు. పొదుపు మహిళలకు వయోజన విద్య ఆవశ్యకతను గూరించి అవగా హన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు, వీఓఏలు సిబ్బంది పాల్గొన్నారు.

మంచినీటి సమస్య లేకుండా చూడాలి



కొత్తకోటలో నీటి లభ్యతను పరిశీలిస్తున్న డీడీ శ్యామల, అధికారులు

సి.బెళగల్: గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా మత్స్యశాఖ డీడీ శ్యామల సూచించారు. ఆమె బుధవారం మండలంలోని కోత్తకోట గ్రామంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు, మండల అధికారులతో కలిసి పర్యటించారు. వీధులలో తిరుగుతూ కూళాయిల ద్వారా సరఫరా అవుతున్న నీటిని పరిశీలించారు. గ్రామంలో మంచినీటి సమస్యపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని కాలనీలకు నూతన పైపులైన్‌తో నీటిని సరఫరా చేసేందుకు వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం స్థానిక పాఠశాలలను సందర్శించి అక్కడ నీటి వనరుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంరక్షణ చర్యలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఎంపీడీఓ రాణెమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనేనాయక్, తదితరులు ఉన్నారు.

టీబీ ముక్త్ భారత్‌గా భూపనపాడు, కొత్తూరు ఎంపిక



మాట్లాడుతున్న డీపీఓ జమివుల్లా

పాణ్యం: టీబీ–ముక్త్ భారత్ కింద భూపనపాడు, కొత్తూరు గ్రామాలను ఎంపిక చేసినట్లు డీపీఓ జమివుల్లా అన్నారు. బుధవారం ఆయన ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ టీబీ నిర్మూలనకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. ఇందులో భాగంగా గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటింటికి వెళ్లి సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఓటీసీ వినయ్, ఎస్‌టీఎస్ శివుడు, ఎస్టీ ఎల్ఎస్, రేణుకాదేవి, సర్పంచ్ జనార్దన్, ఈఓఆర్డీ చంద్రమౌళేశ్వర్‌గౌడ్, ఎంపీహెచ్‌ఈఓ సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పళ్లు రాలుతున్నాయ్!

- పెరుగుతున్న దంత సమస్యలు
- వైద్యుల వద్దకు క్యూ కడుతున్న రోగులు
- పెద్దాసుపత్రిలో మెరుగైన దంత వైద్యం
- నేడు జాతీయ దంత వైద్యుల దినోత్సవం



దంత వైద్యం చేస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): వెళ్లి బ్రష్ చేసుకోరా.. అంటే ఏం.. పులి పళ్లు తోముకుంటుందా అని అతిగా మాట్లాడే బద్ధకస్తులూ ఉన్నారు. వారికి తెలియదేమో.. పులి కూడా పళ్లు తోముకుంటుంది. కొన్ని రకాల గడ్డి, చెట్టు మొదళ్లపై పళ్లను రుద్ది శుభ్రం చేసుకుంటుంది. దానికంటే ఎక్కువ జ్ఞానమున్న మనిషే చేజేతులా ఉక్కు లాంటి పళ్లను నిర్లక్ష్యం చేసి ఊడగొట్టుకుంటున్నాడు. చిన్నతనం నుంచి స్వీట్లు, బేకరీ ఉత్పత్తులు ఎక్కువగా తిని దంతాలను పాడుచేసుకుంటున్నాడు. పెద్దయ్యాక ధూమపానం చేస్తూ, టీ, కాఫీలు అతిగా తాగేస్తూ దంతాలు చెడగొట్టుకుంటున్నారు. ఫలితంగా యుక్త వయస్సు రాకముందే దంతాలు రాలిపోతున్నాయి. ఇలాంటి వారికి అవగాహన కలిగించి దంత ఆరోగ్యం గురించి తెలియజేస్తూ పాడైపోయిన పళ్లకు చికిత్స చేసేవారే దంత వైద్యులు. ఈ నెల 6వ తేదీన జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో 20 నుంచి 30 శాతం మంది ప్రజలు వివిధ రకాల దంత సమస్యలతో బాధపడుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. జీవనశైలి మార్పులతో పాటు మితిమీరి ఆహారం, దంతాలు సరిగ్గా శుభ్రం చేసుకోకపోవడం, స్వీట్లు, చాక్లెట్లు అతిగా తినడం, ధూమపానం, గుట్కా, జర్దా, కిల్లీలు నమలడం వంటి కారణాలతో దంతాలు పాడైపోతున్నాయి. అలాగే జిల్లా పశ్చిమ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నీటిని తాగుతుండటంతో పంటిపై పచ్చని రంగు మచ్చలు ఏర్పడుతున్నాయి. దీనికి తోడు బ్రష్ చేసుకునే విధానం చాలా మందికి తెలియకపోవడం, ఏదైనా తినగానే పుక్కిలించాలనే అవగాహన లేకపోవడం వంటి కారణాలతో పిప్పిపళ్లతో బాధపడేవారి సంఖ్య పెరుగుతోంది.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక చికిత్స

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గత ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం కారణంగా దంత వైద్య సేవలు మరింత మెరుగయ్యాయి. మూడేళ్ల క్రితం ఈ విభాగంలో ఎన్‌ఎంసీ నిబంధనల ప్రకారం పోస్టులను భర్తీ చేశారు. ఒక ప్రొఫెసర్, అసోసియేట్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. వీరిలో పెరియో డాంటిస్ట్, ఎండో డాంటిస్ట్, ఆర్థో డాంటిస్ట్, ఓరల్ సర్జన్ ఉన్నారు. ఇక్కడ పెద్దలతో పాటు చిన్నపిల్లలకూ దంత వైద్య సేవలు అందిస్తున్నారు. పిప్పి పళ్లను సరిచేయడం లేదా తీసేయడం, ఎముక కట్ చేయడం, స్కేలింగ్ చేయడం, చిగుళ్ల వాపులు, రక్తం కారడంపై చికిత్స చేస్తున్నారు. ఏడాది క్రితం రూ.8 లక్షలతో ఓపీజీ మిషన్ (ఎక్స్‌రే), రూ.8 లక్షలతో క్యాన్సర్ స్క్రీనింగ్ కోసం మిషన్ (వెల్‌స్కోప్) కొనుగోలు చేశారు. గత నాలుగేళ్ల కాలంలోనే మూడు ఆధునిక దంత వైద్య చికిత్స చైర్లు వచ్చాయి.

ఉచితంగా సేవలందిస్తున్నాం



దంత వైద్య విభాగంలో ప్రస్తుతం రోజుకు 40 నుంచి 50 మంది దాకా ఓపీ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. చికిత్సకు వచ్చిన వారికి ఆధునిక వైద్య పరికరాలు, ఆధునిక చైర్లపై దంత వైద్యం చేస్తున్నాం. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి 3 నుంచి 4 గంటల వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయి. పాడైన దంతాలు, చిగుళ్ల వ్యాధులకు చికిత్స, పిల్లలకు వచ్చే దంత సమస్యలకు, గుట్కా తినడం వల్ల పాడైన దంతాలకు చికిత్స చేయడం, నోటి క్యాన్సర్‌తో బాధపడే వారికి చికిత్స అందిస్తున్నాం.

–డాక్టర్ ఆర్.విజయకుమార్, దంత వైద్యుడు, జీజీహెచ్, కర్నూలు

అందుబాటులో ఆధునిక దంత వైద్యసేవలు



గతంలో రూట్‌కెనాల్ థెరపీకి మూడు, నాలుగు సార్లు దంత వైద్యులను సంప్రదించాల్సి వచ్చేది. ఇప్పుడు ఒకే విజిట్‌లో ఆర్‌సీటీ పూర్తి చేయవచ్చు. ఎత్తు, వంకర పళ్ల సవరణకు పూర్వం క్లిప్స్ ఉపయోగించేవారు. దీనిస్థానంలో ఇప్పుడు అలైనర్స్ ద్వారా సౌకర్యవంతంగా ఎత్తు, వంకర, సందు పళ్లను సవరించుకోవచ్చు. అల్ట్రాసోనిక్ స్కేలింగ్ సహాయంతో ఎప్పటికప్పుడు దంతాలను శుభ్రం చేసుకోవచ్చు. డెంటల్ లేజర్స్ పరికరం ద్వారా ఇంజెక్షన్స్ లేకుండా రక్తస్రావం రాకుండా కుట్లు వేయవచ్చు. తద్వారా సులువుగా చిగుళ్ల సర్జరీ చేయవచ్చు.

–డాక్టర్ పి.సునీల్‌కుమార్‌రెడ్డి, దంత వైద్యులు, కర్నూలు

రైతులను ఆదుకోవాలి



సుందరయ్య సర్కిల్‌లో ధర్నా చేస్తున్న అఖిలపక్ష రైతు సంఘాలు

కర్నూలు(సెంట్రల్): రైతన్నను ఆదుకోవడానికి వెంటనే ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమలు చేయాలని అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం సుందరయ్య సర్కిల్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, అఖిలపక్ష నాయకులు వెంకటస్వామి, ఎండీ అంజిబాబు, లింగన్న, అరుణ, అలివేలమ్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న అవార్డు ఇచ్చి సన్మానించింది గానీ ఆయన రైతుల శ్రేయస్సు కోసం చేసిన సిఫారసులను మాత్రం అమలు చేయడం లేదన్నారు. వెంటనే కనీస మద్దతు ధర చట్టాన్ని తేవాలన్నారు. మార్కెట్ యార్డుల్లో దళారులను నియంత్రించాలని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలని కోరారు.

జయప్రదం చేయండి

కర్నూలు (సెంట్రల్): సీపీఎం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రజా చైతన్య యాత్రను జయప్రదం చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని కార్మిక, కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ఎండగట్టేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రైతులు, కార్మికుల సమస్యల పరిష్కారం దిశగా పోరాటాలు నిర్వహించాలన్నారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

కల్లూరు: మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఐద్వా (ప్రగతి ఐక్య సంఘం) అధ్యక్షురాలు ఉమా అన్నారు. బుధవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్, బద్రీనాథ్ నగర్‌లలో మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా అధ్యక్షురాలు మాట్లాడుతూ సమాజంలో మహిళలను వివిధ అంశాలపై చైతన్యపరిచేందుకు తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని చెప్పారు. అనంతరం శరీన్‌నగర్, బద్రీనాథ్‌నగర్, సాయినగర్ మహిళలతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు.

ఆర్‌యూకు నిధులు కేటాయించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ మధుమూర్తికి వినతి పత్రం అందజేశారు. బుధవారం విజయవాడలోని ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో చైర్మన్‌ను కలిసి పలు విషయాలను ఆయనకు వివరించారు. టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప, బీసీ విద్యార్థి యువజన సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సూర్య ప్రకాష్ మాట్లాడుతూ.. వర్సిటీలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోధనేతర ఉద్యోగులకు టైం స్కేల్ మంజూరు చేయాలని కోరారు.

దాడి కేసులో నిందితుల అరెస్ట్

కర్నూలు: జిల్లా పోలీసు శాఖ నిఘా విభాగం (స్పెషల్ బ్రాంచ్) ఏఎస్ఐ చింతకుంట మాధవరెడ్డిపై జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. తిలక్ నగర్‌కు చెందిన బిస్నేని పుల్లయ్య, ఎన్‌టీఆర్ నగర్ – యశ్వంత్ ఆచారి, బుధవారపేట రాజీవ్ గృహకల్ప – సురసుర సాయి, సప్తగిరి నగర్ – వడ్డెపల్లి గంటెపోగు నవీన్ తదితరులు గత నెల 27న నంద్యాల చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఎల్‌వీ చికెన్ కడ్డీలు కాల్చే దుకాణం వద్ద మద్యం మత్తులో అల్లరి చేస్తుండగా అటుగా వెళ్తున్న స్పెషల్ బ్రాంచ్ ఏఎస్ఐ మాధవరెడ్డి నివారించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఏఎస్ఐతో గొడవ పెట్టుకుని రాయితో కొట్టి నిందితులు పారిపోయారు. ఈ మేరకు మాధవరెడ్డి మూడో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితులను నంద్యాల చెక్‌పోస్టు వద్ద అరుంధతి నగర్‌కు వెళ్లే రస్తాలో ఉన్న టీవీ టవర్స్ వద్ద అరెస్టు చేసి న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ శేషయ్య తెలిపారు.

డిగ్రీ ఎస్‌ఎస్‌కు 9 మంది గైర్హాజరు

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన పరీక్షలకు 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 11 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 142 మందికిగాను 133 మంది హాజరు కాగా 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు.

కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత



ఎస్వీ దంపతులను సత్కరిస్తున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు (టౌన్): కూటమి ప్రభుత్వ ప్రజాకంటక పాలనపై వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి అన్నారు. వైఎస్సార్ టీయూసీ నగర అధ్యక్షుడిగా నియమితులైన కొట్టాల ప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి స్థానిక గిప్సన్ కాలనీలోని స్వగృహంలో ఎస్వీ దంపతులను గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్వీ మాట్లాడుతూ.. 9 నెలల్లోనే కూటమి పాలనపై ప్రజలకు పూర్తిగా అర్థమైందన్నారు. అన్ని వర్గాలను మోసం చేసిన చంద్రబాబు సర్కార్‌పై ఏ వీధికి వెళ్లిన శాపనార్థాలు వినిపిస్తున్నాయన్నారు. ప్రజలకు అండగా నిలుస్తూ పార్టీని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రసవత్తరంగా వాలీబాల్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్ఐ సునీల్ కుమార్

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో బుధవారం రాత్రి జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలు రసవత్తరంగా జరిగాయి. ఈ పోటీలను స్థానిక ఎస్ఐ సునీల్ కుమార్ క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు. మొత్తం 12 జతలు పాల్గొనగా, అందులో ఈ తాండ్రపాడు జట్టు తొలి స్థానం సాధించి రూ.5 వేలు నగదు బహుమతి అందుకుంది. లక్ష్మీపురం జట్టు రెండో స్థానంలో నిలిచి రూ.3 వేలు, కర్నూలు జి. పుల్లారెడ్డి కళాశాల జట్టు మూడో స్థానంలో నిలిచి రూ.2 వేలు, ఓర్వకల్లు జట్టు నాలుగో స్థానంలో నిలిచి రూ.వెయ్యి నగదు బహుమతి అందుకుంది. ఈ పోటీలకు న్యాయనిర్ణేతగా ఇంతియాజ్‌బాషా వ్యవహరించారు.

చెత్త నుంచి సంపదను సృష్టించాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ లక్ష్మి

కోడుమూరు రూరల్: ప్రతి గ్రామ పంచాయతీలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను వృద్ధిలోకి తీసుకురావాలని డీఎల్‌పీఓ లక్ష్మి సూచించారు. బుధవారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌లో భాగంగా చెత్త నుంచి సంపద తయారీపై కర్నూలు డివిజన్ పరిధిలోని కోడుమూరు, గూడూరు, సి.బెళగల్, కృష్ణగిరి మండలాల పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలకు డీఎల్‌పీఓ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. డీఎల్‌పీఓ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఇంటింటి నుంచి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరుచేసి సంపద తయారీ కేంద్రాల్లో వర్మీ కంపోస్టును తయారు చేయాలన్నారు. తద్వారా పంచాయతీలకు సంపదను సృష్టించాలన్నారు. సర్పంచు భాగ్యరత్న, డీపీఆర్‌సీ ఆర్‌పీ పద్మావతి, ఈఓఆర్డీ మంజుల, ఈఓ అజయ్‌భాస్కర్, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పది పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు



నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సుబ్రమణ్యం

పాణ్యం: ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం తెలిపారు. బుధవారం మండలంలోని పరీక్ష కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. పాణ్యం–ఏ–220 మంది విద్యార్థులు, పాణ్యం–బి 220 మంది, విజయనికేతన్- 200, నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాల–190, బీసీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల–190, బలపనూరు ఉన్నత పాఠశాల–160 మంది చొప్పున విద్యార్థులను కేటాయించినట్లు చెప్పారు. మండలంలో మొత్తం 1180మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు వెల్లడించారు. 66మంది ఇన్విజిలేటర్లు, ప్రతి కేంద్రానికి చీఫ్, డిపాంట్‌మెంట్ అధికారులను నియమిస్తున్నట్లు పెర్కొన్నారు. ప్రతి కేంద్రం వద్ద హెల్త్ సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు. ప్రతి పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు సరిపడ సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. 144సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మేరీ సలోమి , సిబ్బంది పాల్గొన్నారు.

వంద రోజుల పనిదినాలు కల్పించండి



మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్: ఉపాధి హామీ పథకం కింద ప్రతి కుటుంబానికి వంద రోజుల పని దినాలు కల్పించాలని ఏపీఓ మోదీన్‌బాషా సిబ్బందిని ఆదేశించారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో ఏపీఓ మోదీన్ బాషా టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఏపీఓ మాట్లాడుతూ.. కూలీలతో ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేయిస్తే రోజువారీ వేతనం రూ.300 పడుతుందని చెప్పారు. ప్రతి గ్రామంలో 20 ఫారం పాండ్లు తవ్వించాలని, కూలీలు చేసే పనుల్లో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో కూలీలందరికీ పనులు కల్పించడంతో పాటు, పనిచేసే ప్రదేశాల్లో కూలీలకు వసతి సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి పనుల కల్పనలో సిబ్బంది నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో జియారత్



మేళతాళాల మధ్య జెండాలు తీసుకెళ్తుతున్న దర్గా పీఠాధిపతులు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లులో వెలసిన హజరత్ సయ్యద్ సుల్తాన్ మహ్మద్‌షా ఖాద్రి ఉరుసును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ముందుగా స్వాముల వారి దర్గాకు కాయచక్కెరలు సమర్పించి, ప్రత్యేక ఫాతెహాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం జియారత్ నిర్వహించారు. కిస్తీ ప్రసాదాన్ని దర్గా వద్దకు చేర్చి భక్తులకు అందజేశారు. దర్గా పీఠాధిపతి జనరుల్లాషా ఖాద్రి, కరిముల్లాషా ఖాద్రి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన గురువులు ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి, స్వాముల వారి సమాధికి జెండాలు సమర్పించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జిల్లా మలేరియా అధికారి నూకరాజు

కోడుమూరు రూరల్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చని జిల్లా మలేరియా అధికారి నూకరాజు ప్రజలకు సూచించారు. బుధవారం కోలోకేటెడ్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీమంత్ మాదన్న ఆధ్వర్యంలో కోడుమూరులో ఫైలేరియా వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీతో పాటు, దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా మలేరియా అధికారి నూకరాజు సందర్శించి వైద్య సిబ్బంది ప్రజలకందిస్తున్న సేవలను పరిశీలించారు. పట్టణ వీధుల్లో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలంతా తమతమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, పరిసరాల్లో దోమలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల వల్ల ప్రమాదకరమైన జబ్బులతో పాటు మెదడువాపు, మలేరియా, డెంగ్యూ చికున్ గున్యా వంటి జ్వరాలు వస్తాయన్నారు. రాత్రి వేళలో దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని సూచించారు. జిల్లా మలేరియా సహాయ అధికారి చంద్రశేఖర్, ఎంపీహెచ్‌ఈఓ నరసప్ప, హెల్త్ సూపర్‌వైజర్ కమాల్ సాహెబ్, హెల్త్ సూపర్‌వైజర్ ఉమా భాయి, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.